


మన
# భానుపురి
ఇది సూర్యాపేట వార్తల ఉషాకిరణం
శనివారం 15 ఆగష్టు 2026 ఎడిటర్ :- బచ్చు పురుషోత్తం పేజీలు :- 2




## జిల్లాలో పంట మార్పిడికార్యక్రమాన్ని మరింత ముమ్మరం చేయాలి



భానుపురి /సూర్యాపేట కలెక్టరేట్

ప్రస్తుత వర్షపాత పరిస్థితులు, రాబోయే రోజులకు సంబంధించిన వాతావరణ అంచనాలను దృష్టిలో ఉంచుకొని జిల్లాలో చేపట్టిన "రైతులతో మాట -- పంట మార్పిడికి బాట" ప్రత్యేక కార్యక్రమాన్ని మరింత ముమ్మరం చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో రాష్ట్రంలోని వర్షపాతం, భూగర్భ జలాల పరిస్థితి, పంటల సాగు మరియు పంట మార్పిడి పురోగతిపై సమగ్రంగా సమీక్షించారు. రాబోయే వారాల్లో, ముఖ్యంగా సెప్టెంబర్ నెలలో వర్షపాతం సాధారణం కంటే తక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో వ్యవసాయ, సాగునీటి వినియోగంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ నేపథ్యంలో సాగునీటి భరోసా లేని ప్రాంతాల్లో కొత్తగా వరి సాగు చేపట్టే విషయంలో రైతులు జాగ్రత్తగా నిర్ణయం తీసుకోవాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఒకటి రెండు రోజుల వర్షాలను మాత్రమే పరిగణనలోకి తీసుకోకుండా, పంట పూర్తయ్యే వరకు అవసరమైన నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని పంటను ఎంపిక చేసుకోవాలని సూచించారు. జిల్లాలో ఇప్పటికే "రైతులతో మాట -- పంట మార్పిడికి బాట" పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. ఇంకా విత్తనాలు వేయని రైతులను గుర్తించి, వ్యవసాయ శాఖ అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, మండల స్థాయి అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది నేరుగా రైతుల వద్దకు వెళ్లి వారితో మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. స్థానిక నేల స్వభావం, వర్షపాతం, భూగర్భ జలాల లభ్యత, పంట కాలపరిమితి తదితర అంశాలను పరిగణనలోకి తీసుకొని రైతులకు అనువైన ప్రత్యామ్నాయ పంటలపై వ్యవసాయ అధికారులు సలహాలు అందించాలని ఆదేశించారు. సాగునీటి భరోసా లేని ప్రాంతాల్లో పరిస్థితులకు అనుగుణంగా కంది, మినుము, పెసర, మొక్కజొన్న, వేరుశనగ, కూరగాయలు మరియు ఇతర తక్కువ నీటి అవసరం ఉన్న పంటలను వ్యవసాయ, ఉద్యానవన శాఖల సాంకేతిక సలహా మేరకు చేపట్టాలని రైతులకు సూచించారు. రాబోయే 7 నుంచి 10 రోజులు అత్యంత కీలకమైనవని కలెక్టర్ పేర్కొన్నారు. ఇంకా సాగు చేపట్టని విస్తీర్ణం ఎక్కువగా ఉన్న గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, వర్షాల కోసం ఎదురుచూస్తున్న ప్రతి రైతును అధికారులు వ్యక్తిగతంగా కలిసి పంట ఎంపికపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయడానికి ముందుకు వచ్చే రైతులకు అవసరమైన విత్తనాల లభ్యతతో పాటు సాంకేతిక సహకారం అందించేందుకు వ్యవసాయ శాఖ పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. "రైతు ప్రయోజనమే మన ప్రధాన లక్ష్యం. ప్రస్తుతం ఎంత నీరు ఉందన్నది మాత్రమే కాకుండా, పంట పూర్తయ్యే వరకు ఎంత నీరు అందుబాటులో ఉంటుందో అంచనా వేసుకొని పంటను ఎంచుకోవాలి. సాగునీటి భరోసా లేని ప్రాంతాల్లో తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలను చేపట్టాలి. రైతులకు అవసరమైన సాంకేతిక సహకారం అందించేందుకు జిల్లా యంత్రాంగం పూర్తిగా అండగా ఉంటుంది" అని జిల్లా కలెక్టర్ తెలిపారు. మండల ప్రత్యేక అధికారులు, వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు గ్రామాల వారీగా పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని, ఇంకా సాగు ప్రారంభించని ప్రతి రైతుకు సరైన పంట సలహా అందేలా చూడాలని ఆదేశించారు. జిల్లాలోని రైతులు "రైతులతో మాట – – పంట మార్పిడికి బాట" కార్యక్రమానికి సహకరించి, ప్రస్తుత వర్షపాతం మరియు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని వ్యవసాయ అధికారుల సలహాతో సరైన పంటలను ఎంపిక చేసుకోవాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు అన్ని ఏర్పాట్లు



భానుపురి/సూర్యాపేట ఎస్పీ కార్యాలయం

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సంబంధించి సూర్యాపేట జిల్లా పోలీసు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన నూతన పోలీస్ పరేడ్ గ్రౌండ్ నందు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా శుక్రవారం ఏర్పాటను జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ , జిల్లా ఎస్పీ నరసింహ అధికారులతో కలిసి పరిశీలించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో నిర్వహించే పోలీస్ కవాతు రిహార్సల్స్ ను పరిశీలించారు. వేడుకలకు వచ్చే పౌరులకు, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులు ఆదేశించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రజలు, పౌరులు పాల్గొనవచ్చునని విజ్ఞప్తి చేశారు.

## డిపిఆర్ఓ శ్రీనివాస్ సతీమణి మృతికి టియూడబ్ల్యూజే ఐజేయు నేతల సంతాపం



భానుపురి/సూర్యాపేట టౌన్

సూర్యాపేట జిల్లా డీపీఆర్వో వల్లోజు శ్రీనివాస్ సతీమణి వల్లోజు విజయలక్ష్మి అకాల మరణం చెందడంతో టియూడబ్ల్యూజే ఐజేయు సూర్యాపేట జిల్లా నాయకులు వారి పార్థివదేహానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డీపీఆర్వో శ్రీనివాస్ ను పరామర్శించి, ధైర్యం చెప్పి, తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పిస్తూ, విజయలక్ష్మి గారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో టియూడబ్ల్యూజే ఐజేయు సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ కృష్ణ బంటు, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు బత్తుల మల్లికార్జున్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా ప్రధాన కార్యదర్శి రెబ్బ విజయ్ కుమార్, సూర్యాపేట పట్టణ ప్రెస్ క్లబ్ సంయుక్త కార్యదర్శి, సీనియర్ జర్నలిస్ట్ టియూడబ్ల్యూజే ఐజేయు జిల్లా నాయకులు రషీద్ షేక్, యూనియన్ నాయకులు కందుకూరి యాదగిరి, దుస్స చంద్రశేఖర్, సందీప్, రాము తదితరులు పాల్గొన్నారు. విజయలక్ష్మి గారి మృతి పట్ల వారు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసి, డీపీఆర్వో శ్రీనివాస్, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## ఖర్గేను అవమానించిన బీజేపీ ప్రభుత్వానికి చమరగీతం పాడాలి

-దళిత వ్యతిరేక విధానాలను కేంద్ర ప్రభుత్వం విడనాడాలి

-సూర్యాపేటలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో సత్యాగ్రహ దీక్ష



భానుపురి/సూర్యాపేట టౌన్

ఖర్గేను అవమానించిన బీజేపీ ప్రభుత్వానికి చమరగీతం పాడాలని డిసిసి అధ్యక్షుడు గుడిపాటి నరసయ్య అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మహాత్మాగాంధీ విగ్రహం వద్ద ఏఐసీసీ పిలుపు మేరకు సత్యాగ్రహ దీక్ష ను మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాధి తో పాటు కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఎన్నికల సమావేశంలో పాల్గొన్న అనంతరం ఆ ప్రాంతాన్ని నీటితో శుద్ధి చేశారంటూ వచ్చిన ఘటనను ఆయన తీవ్రంగా ఖండించారు. ఒక దళిత నాయకుడు కార్యక్రమానికి హాజరైనందుకే ఆ ప్రాంతాన్ని అపవిత్రమైందని భావించడం దళితులను అవమానించడమేనని అన్నారు. దళితులు, బడుగు బలహీన వర్గాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న పార్టీ ఏదైనా ఉంటే అది బీజేపీనేనని ఆరోపించారు. మైనారిటీ వర్గాలకు కూడా బీజేపీ వ్యతిరేకంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. హిందువుల మధ్య, కులాలమధ్య, మతాల మధ్య చిచ్చుపెట్టి రాజకీయంగా లబ్ధి పొందే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. మల్లికార్జున ఖర్గే పేద కుటుంబంలో పుట్టి అంచెలంచెలుగా ఎదిగి ఏఐసీసీ అధ్యక్షుడి స్థాయికి చేరుకున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ దళిత, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన పార్టీ అని పేర్కొన్నారు. దేశంలో అనేక సామాజిక సంస్కరణలు తీసుకొచ్చి అణగారిన వర్గాల అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కృషి చేసిందన్నారు. సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ దళిత, బడుగు బలహీన వర్గాలకు అండగా నిలుస్తోందని అన్నారు. దేశవ్యాప్తంగా దళితులకు, బడుగు బలహీన వర్గాలకు అనేక పదవులు కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని పేర్కొన్నారు. ఖర్గేను అవమానించేలా వ్యవహరించిన కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం వెంటనే ఆయనకు, దేశంలోని దళిత వర్గాలందరికీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక, దళిత వ్యతిరేక విధానాలను ప్రజలు గమనించాలని కోరారు.రాబోయే ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వాన్ని గద్దెదించి కాంగ్రెస్ పార్టీని, రాహుల్ గాంధీ నాయకత్వాన్ని అధికారంలోకి తీసుకురావాలని ప్రజలకు పిలుపునిచ్చారు. బీజేపీ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని అన్నారు.ఏఐసీసీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో సత్యాగ్రహ దీక్షలు, నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి పౌరుడు ఈ ఘటనను ఖండించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరి కుంట్ల వేణుగోపాల్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు వెలుగు వెంకన్న, జిల్లా యువజన అధ్యక్షుడు ఎలిమినేటి అభినయ్, మాజీ పట్టణ అధ్యక్షుడు అంజద్ అలీ, స్థానిక కౌన్సిలర్ గుణగంటి హేమ సతీష్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కోశాధికారి కక్కిరేణి శ్రీనివాస్, జిల్లా కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్లు, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రావణ శుక్రవారం పూజలు



భానుపురి/సూర్యాపేట కల్చరల్

శ్రావణమాసం మొదటి శుక్రవారం పురస్కరించుకొని సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీ సంతోషిమాత దేవాలయంలో శ్రీ సంతోషిమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ ప్రధాన అర్చకులు ఇరువంటి శివరామకృష్ణ శర్మ తెల్లవారు జామునే శ్రీ సంతోషిమాతకు ప్రత్యేక అభిషేకం నిర్వహిం చారు. భక్తులు సమర్పించిన పట్టు వస్త్రములు అమ్మవారికి అలంకరించి ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించారు. అమ్మవారి సన్నిధిలో గల శ్రీ చక్రమునకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ సంతోషిమాత ఉద్యాపన వ్రతం నిర్వహించారు. అమ్మవారికి వడిబియ్యం పోశారు. శ్రావణ మాసం మొదటి శుక్రవారం కావడంతో భక్తుల అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని చీరలు, రవికలు సమర్పించి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. వైభవలక్ష్మి వ్రతం నిర్వహించారు. ఒకరికి ఒకరు వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. అమ్మవారిని ప్రత్యేక ఊయలలో పవళింపు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులందరికీ అన్న ప్రసాదం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ గౌరవ అధ్యక్షులు నూక వెంకటేశ గుప్త అధ్యక్షులు బ్రాహ్మణపల్లి మురళీధర్ ప్రధాన కార్యదర్శి పబ్బా ప్రకాశరావు, కోశాధికారి కొత్త మల్లికార్జున్ ఉపాధ్యక్షులు సోమ శ్రీశైలం, బ్రాహ్మ0డ్లపల్లి బాల చంద్రుడు, బెలిదే అశోక్ సహాయ కార్యదర్శిలు దేవరశెట్టి సోమయ్య, యమా వెంకటేశ్వర్లు, తల్లాడ కృష్ణమూర్తి, మహంకాళి ఉపేందర్, ముదిరెడ్డి లింగ రెడ్డి చింత వెంకన్న, బజ్జూరి శ్రీనివాస్, నూక రవిశంకర్ , బ్రాహ్మ0డ్ల పల్లి శివప్రసాద్, బ్రాహ్మ0డ్ల పల్లి నాగమణి, శోభ, కక్కిరేణి పద్మ, కర్నాటి సూర్య కళ, పాటి వనజ, తెడ్ల పల్లవి,కొల్లూరి రత్నమాల , కంచర్ల లీల, ఓరుగంటి కనక రత్నం దేవాలయ అర్చకులు బట్టారం వంశీకృష్ణ శర్మ, అశోక్ మిశ్రా దేవాలయం మేనేజర్ బచ్చు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

# దాతృత్వంతో విద్యార్థులకు దుస్తుల పంపిణీ






భానుపురి /జాజిరెడ్డిగూడెం

సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం మండలం కాసర్లపహాడ్ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (ఎంపీపీఎస్)లో విద్యార్థినీ విద్యార్థులకు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు దిర్శనపు సందీప్, దిర్శనపు రమేష్ సోదరులు దుస్తులు పంపిణీ చేశారు. తమ తండ్రిగారైన దిర్శనపు నర్సయ్య జ్ఞాపకార్థం సుమారు రూ.20 వేల విలువైన టీషర్టు, ప్యాంట్లను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భం గా దాతలు మాట్లాడుతూ తమ తండ్రి జ్ఞాపకార్థం విద్యార్థులను ప్రోత్సహిం చాలనే ఉద్దేశంతో దుస్తులు పంపిణీ చేసినట్లు తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షిం చారు. దాతలు చేసిన సేవకు విద్యార్థినీ విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామసర్పంచ్ మంచాల లలితా రామ్మూర్తి, ఉప సర్పంచ్ బుష్పాక శ్రీనివాస్, వేముల బిక్షం, కూరాకుల యుగేందర్, కొంగర సంజీవ, వేముల రమేష్, అజారుద్దీన్, చెరుకు అల్లయ్య, సిరికొండ రవి, బొల్లం వీరమల్లు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఈ.వెంకటేశ్వర్లు, ఉపాధ్యా యులు డబ్బేటి యాదగిరి, భూపతి శ్రీనివాస్, కోన పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థినుల సమస్యలు పరిష్కరించాలనితల్లిదండ్రుల డిమాండ్



భానుపురి/సూర్యాపేట రూరల్

పీజిఎఫ్ నర్సింగ్ కళాశాలలో విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఉదయం విద్యార్థినుల తల్లిదండ్రులు కళాశాల గేటు ఎదుట ఆందోళన చేపట్టారు. తమ పిల్లల చదువు, భద్రత, ఆరోగ్యంపై ఆందోళన వ్యక్తం చేస్తూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.విద్యార్థినులు చేసిన ఆరోపణలపై సంబంధిత అధికారులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి వాస్తవాలను నిర్ధారించాలని తల్లిదండ్రులు కోరారు. ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు విద్యార్థినులకు భద్రత కల్పించాలని, వాస్తవం కాకపోతే అధికారికంగా స్పష్టత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.విద్యార్థినుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కళాశాల యాజమాన్యం, సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని తల్లిదండ్రులు కోరారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు తగిన భద్రతా చర్యలు చేపట్టారు.

# ఘనంగా గోదాఅమ్మవారి పుట్టినరోజు వేడుకలు





భానుపురి/సూర్యాపేట కల్చరల్

జిల్లా కేంద్రంలోని ప్రసిద్ధ శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో గోదా అమ్మవారి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు ఆలయ ప్రధాన అర్చకులు నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాలాచార్యులు సంకర్షణ్ ఆచార్యులు శ్రీహరి ఆచార్యులు ఫణికుమార్ ఆచార్యులు అమ్మవారిని నవ కలశములతో తిరుమంజన స్నపనం నిర్వహించి, పట్టు వస్త్రాలతో అలంకరించి విశేష అలంకరణలు, విశేషాలు అర్చనలు నిర్వహించారు. ఆండాళ్ గోష్ఠి భక్తబృందం దివ్య ప్రబంధం పఠనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయకార్య నిర్వహణ అధికారి లక్ష్మణరావు అభివృద్ధి కమిటీ సభ్యులు, వికాస తరంగిణి ఆండాళ్ గోష్ఠిసభ్యులు, తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం అమ్మవారిని పల్లకిలో అలంకరించి ఆలయ సేవ నిర్వహించారు.

# నకిలీ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ల పట్ల వ్యాపారులు అప్రమత్తంగా ఉండాలి





భానుపురి/సూర్యాపేట ప్రతినిధి

ఉమ్మడి జిల్లా జోనల్ అధికారిణి , అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ వి.జ్యోతిర్మయి ఆధ్వర్యంలో శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంతో పాటు హుజూర్నగర్ పట్టణంలోని పలు కిరాణా షాపులు, సూపర్ మార్కెట్లు, హోటళ్లలో ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తున్న పలు అనుమానాస్పద రంగులు గల పప్పులు, కాలం చెల్లిన (ఎక్స్‌పైరీ అయిన) ఆహార వస్తువులు, ప్రభుత్వం నిషేధించిన టొబాకో మరియు నికోటిన్ ఉత్పత్తులపై విస్తృతంగా సోదాలు చేపట్టారు. ఇందులో భాగంగా కొన్ని షాప్స్, హోటల్స్ లలో అనుమానాస్పద ఆహార నమూనాలను (శాంపిల్స్) సేకరించి, ల్యాబ్ పరీక్షల నిమిత్తం పంపినట్లు అధికారులు తెలిపారు. ప్రతి చిన్న, పెద్ద ఆహార వ్యాపారులు , హోటల్ నిర్వాహకులు తప్పనిసరిగా ఫుడ్ సేఫ్టీ అధికారుల వద్ద లైసెన్స్ లేదా రిజిస్ట్రేషన్స్ పొందాలి. ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే రంగుల ఆహార పదార్థాలు, లూస్ టీ పౌడర్స్,లూస్ ఆయిల్స్, గడువు ముగిసిన వస్తువులను విక్రయించరాదు. ప్రభుత్వం నిషేధించిన గుట్కా, టొబాకో, నికోటిన్ ప్రొడక్ట్స్ అమ్మితే చట్టపరమైన చర్యలు ఉంటాయి. హోటళ్లు కిరాణా షాపులలో నిల్వ ఉంచే ఆహార పదార్థాల వద్ద పూర్తి పరిశు భ్రత పాటించాలి. ఇటీవల కాలంలో కొంతమంది తాము ఫుడ్ ఇన్‌స్పెక్టర్లమంటూ వ్యాపారులను భయభ్రాంతులకు గురిచేస్తూ, డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు ఆరోపణలు రావడంతో అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ వి.జ్యోతిర్మయి స్థానిక వ్యాపారులను పిలిపించి విచారణ జరిపారు. ఎవరైనా అధికారులు తనిఖీలకు వస్తే వారి గుర్తింపు కార్డులను అడిగి ధృవీకరించుకోవాలని సూచించారు. నకిలీ ఫుడ్ ఇన్స్పెక్టర్స్ ఇచ్చే లైసెన్సులు చెల్లుబాటు కావని, అటువంటి నకిలీ లైసెన్సులు రిజిస్ట్రేషన్లు ఇచ్చే నకిలీ ఫుడ్ ఇన్స్పెక్టర్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఒకవేళ ఎవరైనా నకిలీ ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు వచ్చి బెదిరింపులకు పాల్పడితే, వ్యాపారులు భయపడకుండా వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లో గానీ లేదా సంబంధిత ఫుడ్ సేఫ్టీ అధికారులకు గానీ ఫిర్యాదు చేయాలని ఆమె కోరారు. ఈ తనిఖీల్లో స్థానిక ఫుడ్ సేఫ్టీ అధికారులు,బి ప్రభాకర్ సిబ్బంది పాల్గొన్నారు

# హార్వర్డ్‌లో అద్దంకి దయాకర్‌కు అరుదైన విద్యావకాశం

-నిమ్మికల్ నుంచి హార్వర్డ్ దాకా..
-తెలంగాణ నేతకు అంతర్జాతీయ అధ్యయన వేదిక
-నాయకత్వం, పబ్లిక్ నేరేటివ్‌పై ప్రత్యేక కోర్సు

భానుపురి /హైదరాబాద్

సూర్యాపేట జిల్లా నిమ్మికల్ గ్రామంలోని సాధారణ కుటుంబ నేపథ్యం నుంచి ఎదిగి, తెలంగాణ ఉద్యమంలో క్రియాశీల పాత్ర పోషించి, ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వ విప్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న డాక్టర్ అద్దంకి దయాకర్‌కు అరుదైన అంతర్జాతీయ విద్యావకాశం లభించింది. అమెరికాలోని ప్రపంచ ప్రఖ్యాత హార్వర్డ్ విశ్వవిద్యాలయం కెన్నెడీ స్కూల్‌లో ఉన్నత స్థాయి నాయకత్వ విద్యను అభ్యసించేందుకు ఆయన ఎంపికయ్యారు. హార్వర్డ్ కెన్నెడీ స్కూల్‌లోని ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ విభాగంలో ప్రముఖ అధ్యాపకుడు ప్రొఫెసర్ మార్షల్ గ్యాంజ్ నేతృత్వంలో నిర్వహించే 'లీడర్‌షిప్, స్టోరీటెల్లింగ్ అండ్ యాక్షన్' అంశాలకు సంబంధించిన కోర్సులో డాక్టర్ అద్దంకి దయాకర్ పాల్గొననున్నారు. ఈ అధ్యయన కార్యక్రమం 2026 ఆగస్టు 31 నుంచి డిసెంబర్ 18 వరకు కొనసాగనుంది. ప్రపంచంలోని వివిధ దేశాలు, ప్రాంతాలు, విభిన్న సామాజిక నేపథ్యాల నుంచి వచ్చే నాయకులతో కలిసి నాయకత్వంలో ఎదురయ్యే సవాళ్లను విశ్లేషించడం ఈ కార్యక్రమంలో ప్రధాన భాగంగా ఉంటుంది. పబ్లిక్ పాలసీ రూపకల్పనలో నాయకులు ఎదుర్కొనే సమస్యలు, వాటిపై భిన్న దృక్పథాలు, ప్రజలను సమీకరించడంలో నాయకత్వ పాత్ర, సమర్థవంతమైన ప్రజా కథనం, లక్ష్య సాధనకు అవసరమైన కార్యాచరణ తదితర అంశాలపై అధ్యయనం చేయనున్నారు. డాక్టర్ అద్దంకి దయాకర్ రాజకీయ రంగంతోపాటు ఉన్నత విద్యలోనూ ప్రత్యేక గుర్తింపు పొందారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి కామర్స్‌లో డాక్టరేట్ (Ph.D.) పొందిన ఆయన, అదే విశ్వవిద్యాలయంలో మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్ (MCA), మాస్టర్ ఆఫ్ కామర్స్ (M.Com), బ్యాచిలర్ ఆఫ్ లా (LLB) విద్యను పూర్తి చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ సమయంలో టీ–జేఏసీలో క్రియాశీలంగా పనిచేసిన అద్దంకి దయాకర్ అనంతరం కాంగ్రెస్ పార్టీలో కీలక నాయకుడిగా ఎదిగారు. ప్రస్తుతం శాసనమండలి సభ్యుడిగా కొనసాగుతూ తెలంగాణ శాసనమండలిలో ప్రభుత్వ విప్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

**నిమ్మికల్ నుంచి హార్వర్డ్ దాకా..**

సూర్యాపేట జిల్లా నిమ్మికల్ గ్రామంలోని సాధారణ కుటుంబం నుంచి ప్రజా ఉద్యమాల ద్వారా ఎదిగిన అద్దంకి దయాకర్ ప్రయాణం ఇప్పుడు ప్రపంచ ప్రఖ్యాత హార్వర్డ్ విశ్వవిద్యాలయం వరకు చేరడం జిల్లాకే గర్వకారణమని పలువురు అభిప్రాయ పడుతున్నారు. ప్రజా జీవితంలో కొనసాగుతూనే నిరంతర అధ్యయనానికి ప్రాధాన్యం ఇవ్వడం యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొంటున్నారు. హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో ఉన్నత స్థాయి నాయకత్వ అధ్యయనానికి అవకాశం పొందిన డాక్టర్ అద్దంకి దయాకర్‌కు పలువురు మిత్రులు బంధువులు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణకు, ముఖ్యంగా సూర్యాపేట జిల్లాకు చెందిన



నాయకుడు ప్రపంచస్థాయి విద్యా వేదికపై అధ్యయనం చేయడం సంతోషకరమని పేర్కొంది.అదేవిధంగా 'మన దీపం' సంపాదకులు దేగల జనార్ధన్ వ్యక్తిగతంగా డాక్టర్ అద్దంకి దయాకర్‌కు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. హార్వర్డ్‌లో పొందే అధ్యయన అనుభవం ఆయన ప్రజా, రాజకీయ జీవితానికి మరింత ఉపయోగపడాలని, భవిష్యత్తులో ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించేందుకు దోహదపడాలని ఆకాంక్షించారు.

# పారదర్శకంగా పోలీసు సంఘం ఎన్నికలు

భానుపురి/సూర్యాపేట టౌన్

జిల్లా పోలీస్ సంక్షేమ సంఘం ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశామని, రాష్ట్ర డిజిపి ఆదేశాల మేరకు పోలీసు సంక్షేమం లో భాగంగా ఈ ఎన్నికలు నిర్వహిస్తున్నామని , అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి ఎన్నికల నోడల్ అధికారిగా పర్యవేక్షణ చేస్తున్నారు అని ఎస్పీ నరసింహ ఒక ప్రకటనలో తెలిపినారు. ఎన్నికలు రహస్య ఓటింగ్ ద్వారా జరుగుతాయని అన్నారు. దీనికి గాను 29 మంది సభ్యులను ఎన్నుకోవడానికి నోటిఫికేషన్ జారీ చేశామని తెలిపినారు. ఏఆర్ పోలీసు విభాగంలో 11 మంది సభ్యులను, సివిల్ పోలీస్ విభాగంలో 18 మంది సభ్యులను ఎన్నుకోవాల్సి ఉన్నది. డీఎస్పీలు, సర్కిల్ ఇన్స్పెక్టర్ లు, రిజర్వ్ ఇన్స్పెక్టర్ రిటర్నింగ్ అధికారులుగా కొసాగుతారు. 14 వ తేదీ నుండి 16 తేదీ వరకు గ్రూపు సభ్యులు నామినేషన్ వేస్తారు. 17వ తేదీ నామినేషన్ ల పరిశీలన, 18 వ తేదీ మ.2 గంటల వరకు నామినేషన్ ల ఉపసంహరణ, పోటీ అభ్యర్థుల ప్రకటన. 19వ తేదీ నుండి 21వ తేదీ వరకు ఎన్నికలు, వెంటనే ఫలితాల వెల్లడింపు. గెలిచిన 29 మంది సభ్యులు 22వ తేదీన 13 మంది సభ్యులతో కూడిన జిల్లా కమిటీని(ప్యానెల్) ఎన్నుకుంటారు, ఇందులో అధ్యక్షుడు ఉంటారు అని తెలిపారు. ఈ పోలీస్ ఎన్నికల్లో 1067 మంది పోలీసులు ఓటర్లుగా ఉంటారు, రహస్య పద్ధతిలో ఎన్నికలు ఉంటాయి అన్నారు. ఈ ఎన్నికలను అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తాం అని ఎస్పీ అన్నారు.